## క్లుప్తంగా

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

**మరికల్:** కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఓబీసీ జిల్లా చైర్మన్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే చెత్తబుట్టిలో వేసినట్లేనన్నారు. ఓటర్లు ఆలోచన చేసి నిత్యం ప్రజల మధ్యన ఉండే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు.

### బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా శ్రీనివాస్

**మరికల్:** మహబూబ్‌నగర్ బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా గోటూర్‌కు చెందిన శ్రీనివాస్‌ను పార్టీ అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్పీ ఆదేశాల మేరకు ఎంపీగా పోటీచేస్తున్న తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. బహుజనుల రాజ్యంకోసం మనమందరం సిద్ధం కావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

### మురుగు కాలువ నిర్మించాలి



**మాగనూర్:** మండల పరిధిలోని కొత్తపల్లిలోని ప్రధాన రహదారికి ఇరువైపుల మురుగు కాల్వ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రధాన రహదారి వెంబడి మురుగు పారుతుండటంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని, ఇంటి ఆవరణలో కనీసం కూర్చోలేని పరిస్థితి నెలకొందన్నారు. మురుగుతో చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారని సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వనిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### నేడు బీజేపీలో చేరనున్న జెడ్పీటీసీ

**ధన్వాడ:** బీఆర్‌ఎస్‌లో ఉన్న మండల జెడ్పీటీసీ విమల నేడు బీజేపీ పార్టీలో చేరనున్నారు. గతంలో బీజేపీ నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నేడు అరుణమ్మ ఆధ్వర్యంలో తిరిగి సొంతగూటికి చేరనున్నట్లు జెడ్పీటీసీ విమల తెలిపారు.

### గ్యారంటీల అమలు బోగస్



**మహబూబ్‌నగర్ రూరల్:** కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్ అని బీజేపీ మండల ఇన్‌చార్జ్ ఎస్.పాండురంగారెడ్డి విమర్శించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి కోస్గి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గాజులపేట గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తుందంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మండల అధ్యక్షుడు రాజుగౌడ్, మున్నయ్య, జి.నాగరాజు, బి.ఆనంద్, జాన్సీ, కిట్టు పాల్గొన్నారు.

**బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు**

**నవాబుపేట:** మూడో సారి మోదీ దేశ ప్రధాని కావడం ఖాయమని.. బీజేపీ గెలుపు ఎవరు ఆపలేరని నియోజకవర్గం ఇన్‌చార్జ్ బాలత్రిపుర సుందరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేపల్లి, చౌడూర్ గ్రామాల్లో పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం మొత్తం మోదీ కోసం ఎదురు చూస్తుందని ఆమె అన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులు బాలు, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు శ్రీనివాస్, అర్జున్‌రెడ్డి, సతీష్‌గౌడ్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

### ఇరుకైన రహదారులతో ఇక్కట్లు

**అమరచింత:** మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి జూరాల ప్రాజెక్టు మీదుగా గద్వాలకు వెళ్తున్న ప్రధాన రహదారి మస్తీపురం మీదుగా వెళ్తుంది. గ్రామం మధ్యలో ఇరుకైన రహదారి కావడంతో భారీ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు దాపరించాయి. నాలుగు రోజుల కిందట వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఇరుకైన రహదారిపై అదుపు తప్పి గ్రామానికి చెదిన ఐజీ రమేష్ రెడ్డి ఇంటి కాంపౌండ్ వాల్‌ను ఢీకొట్టింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం కాకపోయిన తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా ఆత్మకూర్ పట్టణంలో రహదారిపై డివైడర్‌లు నిర్మించడంతో ఇరుకైన రహదారి తయారైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఇరుకైన రహదారులను గుర్తించి ప్రమాదాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



# పాఠశాలలకు ప్రహరీలేవి?

- అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారుతున్న బడులు
- ఇష్టానుసారంగా పశువుల సంచారం
- ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాఠశాలలో ప్రహరీ లేక ఎండుతున్న మొక్కలు (ఫైల్)



ప్రహరీ లేని ఒబ్లాపూర్ పాఠశాల(ఫైల్)

**మాగనూర్:** మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన ప్రహరీలు కరువయ్యాయి. దీంతో రాత్రిళ్లు మందుబాబులు ఈ పాఠశాలలను అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండలంలోని మొత్తం 24పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 17, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 3 ఉన్నాయి. అందులో 13కు పైగా పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలలో పడిపోయిన సగం గోడలు, మరికొన్ని చోట్ల కొంతమేరకు ఒక భాగంలో నిర్మాణాలు చేపట్టి మిగిలిన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ పాఠశాలల ముందే దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలో గేదెలు, పందులు పాఠశాలలోకి ప్రవేశించి అపరిశుభ్రత వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. చీకటి పడగానే మందుబాబులకు అడ్డాలుగా మారతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటిన వాటికి రక్షణ లేకుండాపోతుంది. ట్రీ గార్డు ఏర్పాటు చేసినప్పటికీ పశువుల బెడదకు వాటిని కాపాడుకోలేకపోతున్నామి ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, స్థానికులు కోరుతున్నారు.

#### ఇబ్బందులు పడుతున్నాం..



పాఠశాలలకు ప్రహరి లేకపోవడంతో ఉదయం పాఠశాలకు రాగానే మందు బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మధ్యాహ్నభోజన సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. సరైన ఆటస్థలాలు కరువయ్యాయి. అధికారులు స్పందించి ప్రహరీలు నిర్మాణం చేపట్టాలి.

– సుమన్, బీజేవైఎం నాయకులు మాగనూర్

#### ప్రహరీలు లేక..



పాఠశాలలో ప్రహరీలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా విద్యార్థులు మధ్యాహ్నభోజన సమయంలో పందులు వచ్చి పేట్లలో భోజనాన్ని విద్యార్థుల నుంచి లాక్కుంటున్నాయి. మొ క్కలు నాటిన రక్షించుకోడానికి వీలు లేకుండా పోయింది. అధికారులు స్పందించి నిర్మాణాలు చేపట్టాలి.

– ప్రశాంత్, హెచ్‌ఎం వర్క్యూర్

#### ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు, వాటికి కావా ల్సిన మౌలిక వసతుల వివరాలను ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నమాట వాస్తవమే. త్వరలోనే సమస్య పరిష్కరించడానికి కృషిచేస్తాం.

– వెంకటయ్య, ఇన్‌చార్జి, ఎంఈఓ మాగనూర్

## బీజేపీ గెలుపును అడ్డుకోలేరు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య

**మక్తల్:** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏర్పాటుచేసిన మండలబూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చేసే మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ఆ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే సముద్రంలో వేసినట్లేనని విమర్శించారు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి పోటీచేస్తున్న డీకే అరుణ విజయం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి బీజేపీ కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు కల్లూరి నాగప్ప, ప్రతాప్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, అనంపల్లి కొండయ్య, నరేందర్, శివరాములు, విద్యాసాగర్, నర్సింహులు, గార్లపల్లి రాజు, కృష్ణామూర్తి, శేఖర్, ఆంజనేయులు, మల్లికార్జున్, రాజుగౌడ్, శ్రీకాంత్, నరేందర్, మోహన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో నాయకుల చేరిక



మక్తల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వాకిటీ శ్రీహరి

**మక్తల్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల్లోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో బీజేపీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రామాల నుంచి ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారు. ఆదివారం మక్తల్‌లో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీను, బీఆర్‌ఎస్ నుంచి ముడుమాల్ మాజీ సర్పంచ్ మడుగు వెంకటేష్, అనంతేష్‌లతోపాటు దాదాపు వందమందిపైగా కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సమక్షంలో చేరికలు సాగుతున్నాయి.

**కృష్ణా:** మండలంలోని కున్సిగ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు.. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చేపార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ ధ్యేయమన్నారు. చేరినవారిలో సాబుగౌడ, జగదీష్, నర్సన్‌గౌడ్, శేఖర్, జనార్దన్, మహాదేవ్, మంగలి సాయిబన్న, శరణప్ప, తిమ్మప్ప పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ సమావేశం

**ఆత్మకూర్:** బీఆర్‌ఎస్ అమరచింత, ఆత్మకూర్ మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం స్థానిక సాయితిరుమల ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి మన్నెశ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్యయాదవ్, ఎస్‌ఆర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా వీరభద్రుడి ఊరేగింపు



పల్లకీ సేవలో స్వామివారు

**కోయిల్‌కొండ:** మండలంలోని వీరభద్రుడి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా స్వామివారి పల్లకీసేవను మండల కేంద్రంలోని తెలుగు వీధి నుంచి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా మండలంలోని ఆచార్యపూర్ సమీపంలోని వీరన్న కొండకు తీసుకెళ్లారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవీరభద్ర ఉత్సవాలలో భాగంగా ఈనెల 22న ప్రభోత్సవం, 23న రథోత్సవం, 24న అగ్నిగుండం, 25న భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలలో ప్రతిరోజు నందికోళ్లసేవ, అఖండ భజనకార్యక్రమాలు ఉంటాయన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

### ఓటమి భయంతోనే వ్యక్తిగత దూషణలు



**నారాయణపేట:** మహిళను కించ పరిస్తే పుట్టగతులుండవని, ఇది చరిత్ర తెలిపిన సత్యమని.. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బి.సుజాత, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు అప్పిరెడ్డిపల్లి నర్సమ్మ హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటుచేసిన స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వంశీచంద్‌రెడ్డి వాడిన పదాలు జుగుప్సాకరంగా ఉన్నాయని అతడికి మహిళలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అంబలి కేంద్రం ప్రారంభం

**మక్తల్:** పట్టణంలోని కొత్తనూగయ్యగుప్తా, రత్నమ్మల జ్ఞాపకార్థకంగా వారి కుమారులు ఆదివారం స్థానిక శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతులమీదుగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అంబలి కేంద్రం ఏర్పాటుచేయడంపై వారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ చైర్మన్ ఫౌండేషన్ బాలకృష్ణారెడ్డి, మాజీ సూర్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, డాక్టర్లు కిరణ్, ప్రమోద్, జగదీష్ గుప్తా, కావలి తాయప్ప, గోవర్ధన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అధ్వానంగా డ్రెయినేజీలు



**ఆత్మకూర్:** పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. భరించరాని కంపుతో స్థానికులు తిప్పలు పడుతున్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి పాతమున్సిపల్ రోడ్డు వైపు నాలుగేళ్లుగా డ్రెయినేజీ కోసం తవ్వి వదిలేయడంతో మురుగు చేరి రోడ్లపై వస్తుంది. అలాగే కొత్తకోట రోడ్డువైపు డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో మురుగు ముందుకు సాగక కంపు కొడుతుంది. మున్సిపాలిటీ పాలకవర్గం, కమిషనర్ త్వరతగతిన సమస్యలను పరిష్కరించి డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అమరచింత:** పట్టణంలోని 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నందిమల్ల, మస్తిపూర్, కిష్టంపల్లి, ప్రియదర్శిని నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామాల్లో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాంచందర్ తెలిపారు. అమరచింత విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాల తీగలకు చెట్ల కొమ్మలు తాకుతుండటంతో అంతరాయం కలుగుతుందని వీటిని తొలగించే పనులను చేపడుతున్నామని వెల్లడించారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

## ఓటుహక్కును వినియోగించుకోవాలి



కోస్గిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు



మల్లేపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**కోస్గి:** ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ శేఖర్ గౌడ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని సమస్యాత్మకమైన పీసీ తాండ, బొల్వోన్‌పల్లి గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఊట్కూరు:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాలచే పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ మేరకు.. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు భద్రతభరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా, ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న పీఠాధిపతి కమలానందభారతిస్వామి

**ఊట్కూరు:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని గన్నవరం శ్రీ భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతిస్వామి అన్నారు. మండలంలోని బిజ్వార్‌లో ఆదివారం అంభత్రయక్షేత్రంలో త్రిశక్తి పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరాశ్రీ ఆధ్వర్యంలో కనుల పండువగా గోకల్యాణం నిర్వహించారు. వేద మంత్రాలచే గోవులకు కల్యాణం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రామాయణంలోని సీతారాములను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. గోవు సర్వధర్మములకు మూలమని గోవుని పూజించడంతో ఎంతో పుణ్య లభిస్తుందని ధర్మశాస్త్రాలు చెప్పుతున్నాయన్నారు. కార్యక్రమంలో నేరడుగం పీఠాధిపతి పశ్చిమ సిద్దిలింగేశ్వరస్వామి, భక్తులు మహేష్‌గౌడ్, హనిమిరెడ్డి, దిడ్డి శేఖర్, కృష్ణయ్య, ఆంజనేయులుగౌడ్, విజయసింహారెడ్డి, రామలింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములను సమానంగా భావించాలి



విజేతలకు మెమెంటోను అందజేస్తున్న నిర్వాహకులు

**దామరగిద్ద:** క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా భావించాలని క్రీడలు శారీరక వికాసానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని నిర్వాహకులు సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్, మోహిన్ అన్నారు. గతవారం రోజులుగా మండలంలోని కాన్‌కుర్తిలో నిర్వహిస్తున్న కాన్‌కుర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్‌లో ఎన్‌బీఎస్ కింగ్స్‌తో భవాని సూపర్ కింగ్స్ పోటీపడగా ఎన్‌బీఎస్ కింగ్స్ విజేతగా నిలించింది. ఈ మేరకు.. నిర్వాహకులు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వహకులు ఆయా క్రీడాబృందాలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



మరికల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

**మరికల్:** మండలంలోని పస్పులలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ తరపున మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డీకే. అరుణను భారీ మేజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని పాలమూరు ఎంపీ అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాగనూర్:** మండలంలోని వడ్వాట్‌లో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు గుంటగారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీకి ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. నాయకులు బస్వరాజ్, నరేందర్, ప్రవీణ్‌గౌడ్, రాకేష్, రాజు, గుంటెప్ప పాల్గొన్నారు.

**కృష్ణా:** బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ గెలువడం తథ్యమని, బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరని నియోజకవర్గ నాయకుడు బలరాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టైరోడ్డులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. నాయకులు సోమశేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, నల్లె నర్సప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ:** ఎంపీ అభ్యర్థి డీకే. అరుణమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని బీజేపీ నాయకులు జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. సుదర్శన్‌గౌడ్, కురుమూర్తి, రవికుమార్‌గౌడ్, శేఖర్, నవీన్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

### 23న కవి సమ్మేళనం

**స్టేషన్ మహబూబ్‌నగర్:** ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని మెట్టుగడ్డలోగల లుంబిని పాఠశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.ఖాజా మైనద్దీన్, కొప్పోలు యాదయ్య ఆదివారం ఓ ప్రకటనలో వివరాలను పేర్కొన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగం కుమారస్వామి, కె.లక్ష్మణ్‌గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కవులు, కవయిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## నేటినుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు



ముస్తాబైన అభయాంజనేయస్వామి ఆలయం



స్వామివారు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండ లో అభయాంజనేయస్వామివారి జయంత్యుత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు రాత్రి ప్రభోత్సవం, 23వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు డోలోత్సవం ఉంటుందన్నారు. 24వ తేదీ తెల్లవారుజామున మూడు గంటలకు రథోత్సవం, అదేవిధంగా అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు శకటోత్సవం ఉంటుందన్నారు. కావున కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.